RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 283 | సంపుటి 4 | బుధవారం | 15-07-2026 | పేజీలు 4 | వెల 3/-



- హనుమకొండలో కూలీ పని నుంచి పోలీసు అధికారిగా విజయ ప్రస్థానం
- విధి నిర్వహణతో పాటు సిబ్బంది నైపుణ్యాభివృద్ధికి విశేష కృషి
- ఓటమికి తలవంచని పోరాట యోధుడు..
- పేదరికాన్ని జయించి పీహెచ్‌డీతో ఖాకీ వనంలో చెరగని ముద్ర
- శిక్షణ, క్రమశిక్షణ, మానవత్వంతో సిబ్బందికి మార్గదర్శకుడిగా..
- గిరిజన యువతకు ఆదర్శంగా నిలిచిన సీఐ కాశీరాం

# ఖాకీ వనంలో కాశీరాం మార్క్

## ఎస్ఐ నుంచి సీఐ వరకు స్వయంకృషితో ఎదిగిన గూడూరు గిరిజన బిడ్డ



**పేదరికం, ఆకలి, కష్టాలు, అవమానాలు... ఇవన్నీ ఆయన జీవితంలో ఎదురైన సవాళ్లే. కానీ వాటికి లొంగిపోకుండా ఆత్మవిశ్వాసం, పట్టుదల, క్రమశిక్షణను ఆయుధాలుగా మార్చుకుని విజయపథంలో దూసుకెళ్లారు. హనుమకొండలో ఖాళీ కడుపుతో కూలీ పని చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించి పీహెచ్ డీ పూర్తి చేసిన మహబూబాబాద్ జిల్లా గూడూరు గిరిజన తండాకు చెందిన కాశీరాం, నేడు తెలంగాణ పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా సేవలందిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు. భూపాలపల్లి జిల్లాలో విధులు నిర్వహిస్తూ పోలీసు సిబ్బందికి ఆధునిక శిక్షణ, మానసిక ధైర్యం, క్రమశిక్షణను పెంపొందించే నాయకుడిగా గుర్తింపు పొందారు. నేరస్థులకు కఠిన అధికారిగా, ప్రజలకు ఆపన్నహస్తంగా, గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కాశీరాం ప్రస్థానం నేటి యువతకు ఆదర్శంగా మారింది.**

— ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో

2

> ఓటమికి తలవంచకుండా, అవకాశాల కోసం ఎదురుచూడకుండా స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించిన కాశీరాం జీవితం నేటి యువతకు ఆదర్శం. గూడూరు గిరిజన తండా నుంచి ప్రారంభమైన ఆయన ప్రయాణం నేడు తెలంగాణ పోలీస్ శాఖలో సేవ, క్రమశిక్షణ, నాయకత్వానికి ప్రతీకగా నిలుస్తోంది. ఆయన ప్రస్థానం పోలీసు సిబ్బందికే కాకుండా సమాజంలోని ప్రతి యువకుడికి స్ఫూర్తినిచ్చే విజయగాథగా నిలిచింది.




తెలంగాణ పోలీస్ శాఖలో ఎంతోమంది అధికారులు తమదైన శైలిలో సేవలందిస్తుంటారు. కానీ కొందరు మాత్రమే విధి నిర్వహణతో పాటు, తోటి సిబ్బందిని తీర్చిదిద్దడంలో, వారిని వృత్తిపరంగా అత్యున్నత స్థాయికి చేర్చడంలో ప్రత్యేక ముద్ర వేస్తారు. అలాంటి వారిలో ఒకరే భూపాలపల్లి జిల్లాలో సీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న కాశీరాం. పేదరికం అడ్డంకి కాదని, పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని తన జీవితంతో నిరూపించిన పోలీసు అధికారి ఆయన. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని ఓ మారుమూల గిరిజన తండాలో జన్మించిన బంజారా బిడ్డ, జీవితంలో ఎన్నో కష్టాలను అధిగమించి నేడు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖలో సమర్థ అధికారిగా, సిబ్బందికి మార్గదర్శకుడిగా గుర్తింపు పొందారు.

### గూడూరు మట్టి నుంచి పోలీస్ బాస్ వరకు..

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలానికి చెందిన ఒక సాధారణ బంజారా కుటుంబంలో కాశీరాం జన్మించారు. ఎటువంటి ఆర్భాటాలు లేని సాధారణ నేపథ్యం నుంచి వచ్చినప్పటికీ.. చిన్నతనం నుంచే పట్టుదల, క్రమశిక్షణను అలవర్చుకున్నారు. సమాజానికి సేవ చేయాలనే బలమైన సంకల్పంతో పోలీస్ శాఖలోకి అడుగుపెట్టారు. సొంత కష్టాన్ని నమ్ముకుని, అంకితభావంతో పనిచేస్తూ సబ్-ఇన్స్పెక్టర్ (SI) నుండి సర్కిల్ ఇన్స్పెక్టర్ (CI) స్థాయికి ఎదిగారు. గిరిజన తండాల నుంచి వచ్చే యువతకు ఆయన నిలువెత్తు నిదర్శనంగా, ఒక రోల్ మోడల్‌గా నిలిచారు.

### సిబ్బందిలో ఆత్మవిశ్వాసం

డ్యూటీల ఒత్తిడిలో ఉండే కానిస్టేబుళ్లు, ఇతర హోంగార్డుల మానసిక స్థైర్యాన్ని పెంచేలా కౌన్సిలింగ్, మోటివేషనల్ సెషన్స్ నిర్వహిస్తున్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో శారీరక దారుఢ్యం ఎంత ముఖ్యమో స్వయంగా ఆచరించి చూపిస్తూ, సిబ్బంది చేత రెగ్యులర్ వ్యాయామం, పరేడ్స్ చేయిస్తున్నారు."ఒక మంచి లీడర్ అంటే కేవలం ఆదేశాలు ఇచ్చేవాడు కాదు.. తన టీమ్‌ను తనతో పాటు నడిపించేవాడు." ఈ సూత్రాన్ని సీఐ కాశిరాం అక్షరాలా పాటిస్తూ భూపాలపల్లి పోలీస్ శాఖలో ప్రత్యేక ప్రశంసలు అందుకుంటున్నారు.

### బంజారా గడ్డ గర్వించదగ్గ బిడ్డ

గిరిజన ప్రాంతమైన గూడూరు నుంచి వచ్చిన కాశిరాం.. తమ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవిస్తూనే, ఉన్నత విద్యావంతుడిగా సమాజంలో ఉన్నత స్థానానికి చేరుకున్నారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చే యువత కూడా కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆయన నిరూపించారు.పోలీస్ డ్యూటీలో ఎంత కఠినంగా ఉంటారో.. ఆపదలో ఉన్న పేద ప్రజల పట్ల, ముఖ్యంగా గిరిజన తండాల ప్రజల పట్ల అంతటి మానవత్వాన్ని చూపిస్తారనే మంచి పేరు ఆయనకు ఉంది. కరుడుగట్టిన నేరస్థుల గుండెల్లో వణుకు పుట్టిస్తూనే, తోటి సిబ్బందికి స్నేహపూర్వక శిక్షణనిస్తూ ముందుకు సాగుతున్న సీఐ కాశిరాం ప్రస్థానం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. గూడూరు మట్టిలో పుట్టిన ఈ బంజారా బిడ్డ, భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ కీర్తి కిరీటంలో ఒక వెలుగుతున్న వజ్రంగా నిలిచారనడంలో ఎలాంటి సందేహం లేదు.

### భూపాలపల్లిలో సరికొత్త అధ్యాయం

**భూపాలపల్లి జిల్లాలో సీఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కాశిరాం కేవలం శాంతిభద్రతల పరిరక్షణకే పరిమితం కాలేదు. పోలీస్ సిబ్బందిలో నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని ఉపయోగించడం, నేరాల పరిశోధనలో అత్యాధునిక పద్ధతులను అవలంబించడంపై సిబ్బందికి ప్రత్యేక క్లాసులు తీసుకుంటున్నారు.**

- ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం
- మున్సిపల్ అధికారుల ఏకపక్ష వైఖరిపై భగ్గుమన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

# కేసముద్రంలో ప్రొటోకాల్ 'గల్లంతు'

కేసముద్రం, జూలై 14( ప్రభాత గమనం) :

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన స్థానిక ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోతోందా? అధికారిక హోదాల్లో ఉంటూ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారుల ఇష్టారాజ్యం ఎటో దారితీస్తోంది? అంటే.. అవుననే సమాధానం ఇస్తున్నాయి కేసముద్రం మున్సిపాలిటీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన పలు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ను పూర్తిగా తుంగలో తొక్కి, స్థానిక వార్డు కౌన్సిలర్లను కరివేపాకులా తీసిపారేసిన తీరు ఇప్పుడు నియోజకవర్గంలో తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై ఆగ్రహించిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం నేరుగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేయడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.



04



04

- టాయిలెట్లు లేక నిత్యం విద్యార్థుల అవస్థలు
- కేసముద్రం మండలం ఇంటికన్నె హైస్కూల్ లో దారుణం
- బాయ్స్ కు టాయిలెట్స్ లేక.. దిక్కుతోచక పొదల్లోకి పరుగులు
- 'స్వచ్ఛ భారత్' నినాదాల వెనుక సిగ్గుచేటైన నిజం

# బడుల్లో 'బహిర్భూమి' బాగోతం..

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్, బుధవారం, 15-07-2026

## బయ్యారం 'ప్యాక్స్' చైర్మన్
# మధుకర్ రెడ్డిపై వేటు!

- అర్హత లేకున్నా చైర్మన్ పీఠం.. విచారణలో బట్టబయలైన అక్రమం
- పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు
- సొమ్ము రికవరీతో పాటు క్రిమినల్ కేసులకు ఆదేశం

**బయ్యారం, జూలై 14 (ప్రభాత గమనం) :**

బయ్యారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పర్సన్–ఇన్–చార్జ్ కమిటీ చైర్మన్ శ్రీ మూల మధుకర్ రెడ్డికి సహకార శాఖ గట్టి షాక్ ఇచ్చింది. వ్యవసాయ భూమి లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా పదవి దక్కించుకున్నారన్న ఆరోపణలు విచారణలో నిజమని తేలడంతో ఆయన్ను చైర్మన్ పదవి నుంచి తక్షణమే తొలగిస్తూ ఉన్నతాధికారులు సంచలన ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయడమే కాకుండా, ఇప్పటివరకు ఆయన పొందిన ఆర్థిక ప్రయోజనాలను రికవరీ చేయాలని, తప్పుడు సమాచారంతో మోసం చేసినందుకు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించడం సహకార వర్గాల్లో కలకలం రేపుతోంది.మధుకర్ రెడ్డికి బయ్యారం ప్యాక్స్ పరిధిలో సొంతంగా ఎలాంటి వ్యవసాయ భూమి లేదని, ఆయన చైర్మన్‌గా కొనసాగడానికి వీల్లేదంటూ అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన సహాయ రిజిస్ట్రార్.. నివేదికను సమర్పించారు. అనంతరం మధుకర్ రెడ్డికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేసి వివరణ కోరారు.తన వివరణలో సాదా బైనామా ద్వారా తనకు కొంత భూమి ఉందని ఆయన సమర్థించుకునే ప్రయత్నం చేశారు. అయితే చట్టబద్ధమైన ఈ–పట్టాదారు పాస్‌బుక్ కానీ, రిజిస్ట్రేషన్ పత్రాలు కానీ సమర్పించడంలో ఆయన విఫలమయ్యారు.ఈ వివాదంపై పూర్తి స్థాయి స్పష్టత కోసం మహబూబాబాద్ ఆర్డీవో ఆధ్వర్యంలో భూ భారతి, పహాణీలు, ఇతర రెవెన్యూ రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. మధుకర్ రెడ్డి పేర్కొన్న సర్వే నంబర్లలో ఆయన పేరు ఎక్కడా నమోదు కాలేదు. సాదా బైనామా ద్వారా తన ఆధీనంలో ఉన్నాయని ఆయన చెప్తున్న భూములు.. వాస్తవానికి ఇతరుల పేర్లపై రిజిస్టర్ అయి ఉన్నాయి.

బయ్యారం మండలం మొత్తంలో ఆయన పేరిట ఎలాంటి ఈ–పట్టాదారు పాస్‌బుక్ జారీ కాలేదని ఆర్డీవో నివేదికలో స్పష్టంగా తేలింది.తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964 సెక్షన్ 19(3) ప్రకారం.. ఒక వ్యవసాయ సహకార సంఘంలో సభ్యుడిగా కొనసాగాలంటే సదరు సంఘం పరిధిలో తప్పనిసరిగా వ్యవసాయ భూమి కలిగి ఉండాలి. అధికారిక రికార్డుల ప్రకారం మధుకర్ రెడ్డికి భూమి లేనందున, ఆయన సభ్యత్వం మొదటి నుంచే చెల్లదని అధికారులు తేల్చేశారు. సభ్యత్వమే లేనప్పుడు పీఏసీ చైర్మన్‌గా కొనసాగే అర్హత ఆయనకు ఎంతమాత్రం ఉండదని స్పష్టం చేశారు.మధుకర్ రెడ్డిని ప్యాక్స్ పీఏసీ చైర్మన్/సభ్యత్వ పదవి నుంచి తక్షణమే తొలగించారు. ఇకపై ఆయనకు సంఘంలో ఎలాంటి పరిపాలనా, ఆర్థిక, చట్టపరమైన అధికారాలు ఉండవు.మిగిలిన అర్హులైన పీఏసీ కమిటీ సభ్యులతోనే సంఘం కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయి.మిగిలిన కమిటీ సభ్యులు రాబోయే మూడు రోజుల్లో సమావేశమై తమలో ఒకరిని కొత్త చైర్మన్‌గా ఎన్నుకోవాలి. ఈ ఎన్నిక ప్రక్రియకు సహాయ రిజిస్ట్రార్ శ్రీ కె. రమేష్ పరిశీలకునిగా వ్యవహరిస్తారు.మధుకర్ రెడ్డి తన వద్ద ఉన్న అధికారిక రికార్డులు, మినిట్స్ పుస్తకాలు, నగదు, చెక్‌బుక్‌లు, తాళాలను 24 గంటల్లోగా సొసైటీ సెక్రటరీ/సీఈఓకు అప్పగించాల్సి ఉంటుంది.చైర్మన్ హోదాలో ఇప్పటివరకు ఆయన పొందిన గౌరవ వేతనం , ప్రయాణ భత్యాలను తిరిగి వసూలు చేసి ప్యాక్స్ ఖాతాలో జమ చేయాలని సెక్రటరీని ఆదేశించారు.తప్పుడు పత్రాలతో సంస్థను మోసం చేసినందుకు తెలంగాణ సహకార సంఘాల చట్టం, 1964తో పాటు భారతీయ న్యాయ సంహిత కింద మధుకర్ రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సెక్రటరీకి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజా ప్రతినిధులుగా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి, చట్టాన్ని చుట్టంగా మార్చుకోవాలనుకునే వారికి ఈ ఘటన ఒక బలమైన హెచ్చరికగా నిలిచింది.

## పల్లవికి కేయూ డాక్టరేట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**




కాకతీయ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధకురాలు పల్లవి జేరుపోతులకు డాక్టరేట్‌ను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ప్రకటించారు. "2–అమినోథియాజోల్ ఆధారిత జీవసామర్థ్య హెటెరోసైక్లిక్ సమ్మేళనాలు: సంశ్లేషణ, లక్షణ నిర్ధారణ, జీవసంబంధిత మూల్యాంకనం మరియు మాలిక్యులర్ డాకింగ్ అధ్యయనాలు" అనే పరిశోధన అంశంపై ఆమె తన పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ పరిశోధనను రసాయన శాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య జి. హనుమంతు పర్యవేక్షణలో పూర్తి చేశారు. ములుగు మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన డాక్టర్ పల్లవి జేరుపోతులకు డాక్టరేట్ లభించిన సందర్భంగా విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## ఇంటింటి ఫీవర్ సర్వే,

- హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన డీఎంహెచ్‌వో డాక్టర్ ఏ. అప్పయ్య

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



జిల్లాలో సీజనల్ వ్యాధుల నివారణకు చేపడుతున్న ఇంటింటి ఫీవర్ సర్వేను ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఏ. అప్పయ్య అధికారులకు సూచించారు. జ్వర సర్వేలో భాగంగా ఇంటింటికి వెళ్లే సిబ్బంది కేవలం జ్వరం, ఇతర ఆరోగ్య సమస్యల గురించి ఆరా తీయడమే కాకుండా, సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డ్రైడే నిర్వహణ ప్రాముఖ్యతపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. మంగళవారం పోచమ్మకుంట పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న ఇంటింటి ఫీవర్ సర్వేను అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్ రావుతో కలిసి డీఎంహెచ్‌వో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడిన ఆయన, ప్రతి ఒక్కరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వివరించారు. లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ శిబిరాన్ని డీఎంహెచ్‌వో సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా ఈరోజు 30 మంది బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ రాజా హైదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, వైద్యాధికారులు డాక్టర్ దీప్తి, డాక్టర్ రాజా హైదర్, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఖాదర్ అబ్బాస్, సూపర్వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.



## నేరాల నియంత్రణపై
# నిఘా కొనసాగించాలి

- పెండింగ్ కేసుల్లో నిందితుల అరెస్టులను వేగవంతం చేయాలి
- నాణ్యమైన దర్యాప్తుతో అధిక శాతం కన్విక్షన్లు సాధించాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, అధ్యక్షతన జూన్–2026 నెలకు సంబంధించిన జిల్లా స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తు కేసులు, నేరాల నియంత్రణ చర్యలు, శాంతిభద్రతల పరిరక్షణ, దర్యాప్తు నాణ్యత తదితర అంశాలపై ఎస్పీ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల్లో, ముఖ్యంగా నిందితులు ఇంకా అరెస్టు కాకుండా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్ అరెస్టులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రతి కేసు దర్యాప్తును వేగవంతం చేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలోని గ్రేవ్ కేసులు, పెండింగ్‌లో ఉన్న లాంగ్ పెండింగ్ కేసులు, మహిళలు, చిన్నారులపై నేరాలు, ఎస్సీ ఎస్టి కేసులు, ఆస్తి సంబంధిత కేసుల దర్యాప్తును ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలు ఇసుక అక్రమ రవాణా, గుడుంబా, పిడిఎస్ బియ్యం, నల్ల బెల్లం అక్రమ రవాణా వంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులపై నిరంతర నిఘా కొనసాగిస్తూ, నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ, ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ భద్రతపై ప్రచార కార్యక్రమాలు మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్ ) గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. మానవ హక్కుల కమిషన్ , మహిళా కమిషన్, ఎస్సీ.ఎస్టీ కమిషన్ తదితర సంస్థల నుంచి వచ్చే పిటిషన్లను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, కోర్టు సమన్లు, సకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలు పోలీస్ స్టేషన్లకు వచ్చినప్పుడు వారి ఫిర్యాదులను మర్యాదపూర్వకంగా స్వీకరించి, సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. అలాగే ఇటీవల కోర్టుల్లో కన్విక్షన్ సాధించిన కేసులలో విశేష కృషి చేసిన కోర్ట్ డ్యూటీ అధికారులు, దర్యాప్తు అధికారులు మరియు సంబంధిత పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు. ఇదే స్ఫూర్తితో ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి అధిక శాతం కన్విక్షన్లు సాధించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ అధికారులు, సీఐలు, ఎస్హెచ్ఓలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- పీఆర్టీయు టీఎస్ సంఘం మండల అధ్యక్షులు గోపాల శ్రీధర్
- జోరుగా సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం

**కేసముద్రం, జూలై 14(ప్రభాత గమనం):**



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయు టీఎస్ లక్ష్యం అని ఆ సంఘం కేసముద్రం మండల శాఖ అధ్యక్షులు గోపాల శ్రీధర్ అన్నారు.మంగళవారం సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో మండలం లోని ఎంపీపీఎస్ కేసముద్రం స్టేషన్, బ్రహ్మంగారి తండ, చంద్రు తండ, ఇంటికన్నె, కాట్రపల్లి, భవాని గడ్డ తండ, బోడ మంచ్య తండ, గుడి తండ, ఎన్టీఆర్ నగర్, కేసముద్రం విలేజ్ ప్రాథమిక పాఠశాలలతో పాటు ఎంపీ యుపిఎస్ వెంకటగిరి, అర్పనపల్లి, బేరువాడ ప్రాథమికోన్నత పాఠశాలలు,అదేవిధంగా జడ్పీహెచ్ఎస్ ఇంటికన్నె, కాట్రపల్లి, కేసముద్రం విలేజ్ పాఠశాలల నందు పీఆర్టీయు టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీఆర్టీయు టీఎస్ కేసముద్రం మండల అధ్యక్షులు గోపాల శ్రీధర్ మాట్లాడు తూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయు టిఎస్ సంఘం ప్రాథమిక లక్ష్యం అని, ఐక్యంగా ఉంటేనే మనం మన హక్కులను సాధించుకోగలమని,ప్రతి ఉపాధ్యాయుడు ఈ సభ్యత్వ నమోదులో పాల్గొని సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎక్కువ సభ్యత్వాలని కలిగి ఉండి, ఉపాధ్యాయుల సమస్యల సాధన కై ఎల్లప్పుడూ పిఆర్టియు టీ ఎస్ సంఘం ముందు వరుసలో నిలబడి ఉపాధ్యాయులకి తోడుగా నిలుస్తుందని అన్నారు.ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసే సంఘం పిఆర్టియు అని అన్నారు. త్వరలో పదోన్నతులతో కూడిన బదిలీలను, 317 భాధితుల కోసం తీసుకువచ్చిన 190 జీ.ఓ అమలుకై సంఘం కృషి చేస్తుందని సంఘం మండల అధ్యక్షులు గోపాల శ్రీధర్ తెలిపారు. వేతన సవరణ సంఘం సిఫార్సుల అమలులో జరుగుతున్న ఆలస్యం ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తోందని, గ్రేడ్–2 హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను పారదర్శకంగా,తక్షణమే చేపట్టేలా పిఆర్టియు టిఎస్ సంఘం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకు వస్తుందని సంఘం మండల అధ్యక్షులు గోపాల శ్రీధర్ తెలిపారు. పీఆర్టియు టీఎస్ కేసముద్రం మండల ప్రధాన కార్యదర్శి బీరం జనార్దన్ రెడ్డి మాట్లాడు తూ..ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సదుపాయాలు కల్పించే ఈహెచ్ఎస్ సమర్థవంతంగా అమలు అయ్యే విధంగా తమ సంఘం కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎక్కువ సభ్యత్వాలను కలిగి ఉండి ఉపాధ్యాయుల సమస్యల సాధనకై నిరంతరం పోరాటం చేసే సంఘం పీఆర్టియు టీఎస్ మాత్రమేనని ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బీరం జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కోట కనకయ్య,రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కుర్న హరినాథ్, సీనియర్ నాయకులు పి.జనార్ధన్, సింగారపు ఉపేందర్, జె. రాజు, కె.రాజ్ కుమార్, బానోత్ వాగ్య,ఎం.కపిల్ రెడ్డి తోపాటు ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పరిశ్రమల స్థాపనతో ఆర్థికంగా ఎదగాలి

- సంబంధిత శాఖలు ప్రణాళికలు సిద్ధం చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్, జులై 14 (ప్రభాత గమనం):**



జిల్లాలోని నిరుద్యోగ యువత, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీతో పాటు అన్ని వర్గాల ప్రజలు నూతన పరిశ్రమలు స్థాపించి ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో టిఎస్ ఐ పాస్ ద్వారా వివిధ శాఖలకు సంబంధించి 60 దరఖాస్తులు అందగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి 44 దరఖాస్తులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఎస్సీకి చెందిన 5 మంది, ఎస్టీకి చెందిన 30 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద సబ్సిడీ రుణాల మంజూరుకు ప్రతిపాదనలను ఆమోదించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిస్థితులకు అనుగుణంగా చిన్న, సూక్ష్మ పరిశ్రమలు స్థాపించేందుకు నిరుద్యోగ యువత ముందుకు రావాలని, ఇందుకు పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, సంక్షేమ శాఖలు, బ్యాంకులు పూర్తి సహకారం అందిస్తాయని తెలిపారు. ప్రతి సంవత్సరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు సుమారు రూ.600 కోట్ల వడ్డీలేని బ్యాంకు లింకేజీ రుణాలు అందుతున్నాయని, వాటిని పౌల్ట్రీ ఫారాలు, కోల్డ్ స్టోరేజీలు, గోదాములు, రెడీమిక్స్ యూనిట్లు, మక్కజొన్న విత్తనాలు, మిర్చి ఆధారిత పరిశ్రమలు తదితర తయారీ రంగాల్లో వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని మిర్చి ప్రాసెసింగ్ యూనిట్లలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య విద్యను అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అవశేషాలను (పంట కొయ్యలు) పొలాల్లో కాల్చడం వల్ల వాయు కాలుష్యం పెరుగుతుందని, వాహనాల నుంచి వెలువడే పొగ కూడా కాలుష్యానికి కారణమవుతుందని పేర్కొంటూ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువత కోసం అనేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, డిఈఈటి, ఎన్ఏటిఎస్ తదితర పోర్టళ్లలో యువత తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. మిర్చి పరిశ్రమల్లో జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించేలా జిల్లాలో జ్యూట్ బ్యాగుల తయారీ యూనిట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులతో పాటు చివరి సంవత్సరం విద్యార్థులందరినీ ఎన్ఏటిఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో 30 మందికి పైగా కార్మికులు పనిచేస్తున్న అన్ని పరిశ్రమలు కూడా ఎన్ఏటిఎస్ పోర్టల్‌లో నమోదు చేసుకుని, పథకం నిబంధనల మేరకు అప్రెంటిస్‌లను నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ విజయేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారులు శ్రీనివాసరావు, దేశీ రామ్ నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, ఫ్యాక్టరీలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు, జిల్లా ఉపాధి కల్పన అధికారి రజిత తదితరులు పాల్గొన్నారు.



## సత్వర న్యాయం అందేలా
# కృషి చేయాలి

- వరంగల్ సీపీ ఎన్. శ్వేత
- రూ.50 లక్షల విలువైన 352 పోగొట్టుకున్న సెల్ ఫోన్లను బాధితులకు అందజేత

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రజలకు సత్వర న్యాయం అందించడమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కాకతీయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల సమావేశ మందిరంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, కేసుల ఛేదన, శాంతిభద్రతల పరిస్థితి, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నివారణ, సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై పోలీస్ కమిషనర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్. శ్వేత మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగంగా పూర్తి చేయడంతో పాటు నిందితుల అరెస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చోరీ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సొత్తును చట్టపరమైన ప్రక్రియ పూర్తైన వెంటనే బాధితులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా పాఠశాలల పరిసరాల్లో గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ప్రజల నుంచి అందే ప్రతి పిటిషన్‌ను తప్పనిసరిగా నమోదు చేసి, వెంటనే విచారణ అధికారిని నియమించి నిర్ణీత గడువులో నాణ్యమైన విచారణ పూర్తి చేయాలని తెలిపారు. అలాగే డయల్–100 ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి బాధితులకు సకాలంలో సేవలు అందించాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్ అమలు చేయాలని సీపీ పేర్కొన్నారు. భూ వివాదాలకు సంబంధించిన కేసుల్లో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను ఖచ్చితంగా పాటించాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచి అవసరమైన చోట రౌడీ షీట్లు తెరవాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

**352 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేత**

అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీకి గురైన లేదా పోగొట్టుకున్న సుమారు రూ.50 లక్షల విలువైన 352 మొబైల్ ఫోన్లను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా ట్రాక్ చేసి స్వాధీనం చేసుకున్న పోలీసులు, వాటిని బాధితులకు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సెల్‌ఫోన్ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన బాధితులు తప్పనిసరిగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు. పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో విశేష ప్రతిభ కనబరిచిన ఐటీ సెల్ బృందాన్ని ఆమె అభినందించారు. ఈ సమావేశంలో డీసీపీలు అకింత్ కుమార్, ధారా కవిత, రాజమహేంద్ర నాయక్, కిషోర్ సింగ్, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్స్పెక్టర్లు, స్టేషన్ హౌస్ అధికారులు (ఎస్‌హెచ్‌వోలు), ప్రత్యేక విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో రాజీపడొద్దు

- దొంగతనాలు, గంజాయి కేసులపై బలమైన ఇన్ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి
- కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో నేరస్తులకు శిక్షపడేలా కృషి చేయాలి
- పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
- నేర సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకెన్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా కేంద్రంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు అధికారులతో అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా దొంగతనాలు, గంజాయి అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలన, కల్తీ మద్యం, గుడుంబా తయారీ, రోడ్డు ప్రమాదాలు మరియు ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణపై ఎస్పీ చర్చించారు. దొంగతనాల నియంత్రణ కు ప్రస్తుతం నిర్వహిస్తున్న గస్తీ విధులు పెంచాలని ఎస్పీ అధికారులకు సూచించారు జాతీయ రహదారినీ ఆనుకొని ఉన్న గ్రామాలలో గస్తీ పెంచాలని . నేరాల నియంత్రణకు మారుమూల గ్రామాలలో సైతం సీసీ కెమెరాల యొక్క ఉపయోగాలు తెలియచేస్తూ, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ సీసీ కెమెరాలను పెట్టించేలా కృషి చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు గ్రామస్థాయిలో బలమైన సమాచార వ్యవస్థ (ఇన్ఫార్మర్ నెట్‌వర్క్) ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా క్రమం తప్పకుండా వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి రవాణాను అడ్డుకోవాలని, యువత గంజాయి వినియోగానికి అలవాటు పడుతున్న ప్రాంతాలను (హాట్‌స్పాట్స్) గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అరైవ్ – అలీవ్ కార్యక్రమం లో భాగంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. మైనర్ డ్రైవింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకుండా తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసులలో బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేయాలని ఆదేశించారు. మద్యం కల్తీ చేసే వారిపై, గుడుంబా తయారీ దారులపై కఠిన వైఖరి ప్రదర్శించాలని ఆదేశించారు. గ్రామస్తుల భాగ



స్వామ్యంతో గుడుంబా రహిత గ్రామాలు గా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కోర్టు విచారణలలో ఉన్న కేసుల పురోగతిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కానిస్టేబుల్ ల పనితీరును నిత్యం పర్యవేక్షించాలని, సరైన సాక్ష్యాధారాలను, సాక్షులను సరైన సమయంలో కోర్టులలో ప్రవేశపెట్టి నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలని, నిరంతరం ఆదేశించారు. అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ఎవరైనా అధికారి విధులలో నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏ ఎస్ పి ఏటూరునాగారం మనన్ బట్ ఐపిఎస్, అదనపు ఎస్ పి సదానందం, డి సి ఆర్ బి డి ఎస్ పి కిషోర్ కుమార్, డి ఎస్ పి ములుగు రవీందర్, సీఐలు, ఎస్ఐలు డీసీఆర్బీ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్యకు ఆధునిక పద్ధతులే కీలకం

- ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించిన కలెక్టర్ సత్యశారద

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

జిల్లాలో ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరచి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సామర్థ్యాభివృద్ధి (కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) శిక్షణలను జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. సత్యశారద మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్ఎస్ కరీంబాద్, జీహెచ్ఎస్ శంభునిపేట్ శిక్షణ కేంద్రాలను సందర్శించి శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. శిక్షణ తరగతులను ప్రత్యక్షంగా వీక్షించిన కలెక్టర్, వివిధ సబ్జెక్టులకు చెందిన ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస స్థాయిని పెంపొందించే వ్యూహాలు, తరగతి గది నిర్వహణ, కార్యాచరణ ఆధారిత బోధన, అభ్యాస ఫలితాల సాధన వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ శిక్షణల్లో సాంఘిక శాస్త్రం, ఫిజికల్ సైన్స్, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, హిందీ, ఎస్‌జీటీ, ఎంఆర్‌పీఎస్, ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. సత్యశారద మాట్లాడుతూ, "ఉపాధ్యాయుడే విద్యార్థి భవిష్యత్తుకు శిల్పి. ఉపాధ్యాయులు నిరంతరం తమ జ్ఞానాన్ని, బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించగలుగుతారు. శిక్షణలు కేవలం హాజరు నమోదుకే పరిమితం కాకుండా తరగతి గదిలో బోధనలో స్పష్టమైన మార్పు తీసుకురావాలి" అని అన్నారు. శిక్షణలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకుని జిల్లాను విద్యారంగంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్యనాయుడు, అకడమిక్ మానిటరింగ్ అధికారి ఉండ్రాతి సుజన్ తేజ, ఉల్లాస్ కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయ శిక్షణను పరిశీలించిన అదనపు కలెక్టర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో:**

హనుమకొండ జిల్లా సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సోషల్ స్టడీస్ సమగ్ర ఇన్–సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నిడగుగొమ్ముల రవి మంగళవారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థి కేంద్రిత బోధన, ఆధునిక బోధనా విధానాల అమలు, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం, విశ్లేషణాత్మక ఆలోచన, సామాజిక అవగాహన పెంపొందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, కేంద్ర ఇన్‌చార్జి నెహ్రూ నాయక్, జిల్లా నాణ్యత సమన్వయకర్త (ఏఎంఓ) డా. బండారు మన్మోహన్, రిసోర్స్ పర్సన్లు, సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువతకు ఓటు హక్కు కల్పించాలి

- గార్ల మండలంలో 5వేల మందికి పైగా కొత్త ఓటర్లు ఉండే అవకాశం
- 20 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక కౌంట ఏర్పాటు చేయాలి
- తహసీల్దార్ శారదకు బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు అజ్మీర రాము విజ్ఞప్తి

**గార్ల, జూలై 14 (ప్రభాత గమనం) :**



గార్ల మండలంలో కొత్తగా ఓటు హక్కుకు అర్హత సాధించిన ప్రతి ఒక్క యువకుడికి, యువతికి ఓటరుగా నమోదు చేసుకునేందుకు తగిన అవకాశం కల్పించాలని బీజేపీ నాయకులు, మహబూబాబాద్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు అజ్మీర రాము కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన గార్ల మండల తహసీల్దార్ శారద గారికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా అజ్మీర రాము మాట్లాడుతూ, మండలంలో ఓటర్ల నమోదు ప్రక్రియ ముగియడానికి కేవలం 11 రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని గుర్తు చేశారు. ఈ గడువు ముగిసినప్పటికీ, అర్హులైన యువతకు ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.గార్ల మండల పరిధిలో సుమారు 5,000 మందికి పైగా కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హులైన యువత ఉండే అవకాశం ఉందని రాము అంచనా వేశారు. వీరిలో ఇప్పుడే 18 సంవత్సరాలు నిండిన వారితో పాటు, 22 సంవత్సరాలు దాటినప్పటికీ వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.యువతకు ఓటరు నమోదు ప్రక్రియను మరింత సులభతరం చేయాలని అజ్మీర రాము కోరారు. ఇందుకోసం గార్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీల వారీగా ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తే యువతకు అవగాహన పెరిగి, ఓటరు నమోదు సంఖ్య గణనీయంగా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి, గార్ల మండలంలో అర్హులైన ప్రతి యువతీ యువకుడికి ఓటు హక్కు కల్పించేలా తహసీల్దార్ శారద గారు తగిన చర్యలు తీసుకోవాలని అజ్మీర రాము వినమ్రంగా కోరారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- స్పోర్ట్స్ స్కూల్, జేఎన్ఎస్, స్విమ్మింగ్ పూల్ ను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులకు సూచించారు. విద్యతో పాటు క్రీడా నైపుణ్యాలను సమానంగా అభివృద్ధి చేయడం ద్వారానే సమగ్ర వ్యక్తిత్వం కలిగిన విద్యార్థులు తయారవుతారని ఆమె అన్నారు. మంగళవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి విద్యా ప్రమాణాలు, క్రీడా శిక్షణ, మౌలిక వసతులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో నాలుగో, ఐదో తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ తెలుగు, ఆంగ్ల భాషలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. జాతీయ జెండా విశిష్టత, అశోక ధర్మచక్రం ప్రాధాన్యతపై విద్యార్థులు ఇచ్చిన సమాధానాలను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కోచ్‌లతో మాట్లాడిన కలెక్టర్ ప్రతి విద్యార్థిలోని సహజ ప్రతిభను గుర్తించి ఆయా క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందించాలని సూచించారు. క్రీడా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు భవిష్యత్తులో దేశానికి పతకాలు సాధించే క్రీడాకారులుగా ఎదగాలంటే శాస్త్రీయ శిక్షణతో పాటు నాణ్యమైన విద్య కూడా అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం నాణ్యత, వసతి గృహాలు, ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం తరగతి గదులు, భోజనశాల, వంటశాల, వసతి గృహాలు, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నాలుగో తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసిన కలెక్టర్ బాగా చదువుకోవడంతో పాటు క్రీడల్లోనూ రాణించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. తదనంతరం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని జిమ్ హాల్, ఇండోర్



స్టేడియం, ఇతర క్రీడా మౌలిక వసతులను పరిశీలించారు. ఇండోర్ స్టేడియంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

### స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తులు త్వరగా పూర్తి చేయాలి

అనంతరం జిల్లా యువజన సేవలు మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడ జరుగుతున్న మరమ్మత్తు, అభివృద్ధి పనులను పరిశీలించారు. వాటర్ పైప్‌లైన్ వ్యవస్థ, జిమ్ సెంటర్, ఇతర సదుపాయాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. స్విమ్మింగ్ పూల్ మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు వినియోగించుకునేలా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. నిర్వహణలో ఎలాంటి అంతరాయం లేకుండా నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని, తరచూ మరమ్మత్తులు అవసరం లేకుండా శాశ్వత పరిష్కారాలతో నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు. అవసరమైతే సాంకేతిక నైపుణ్యం కలిగిన సిబ్బందిని నియమించాలని కూడా పేర్కొన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి ప్రశాంత్, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాధవి, రవికుమార్, డీఈ రాజ్‌కుమార్, యువజన సేవలు మరియు క్రీడల శాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# బంగారు కోటగా మానుకోట అభివృద్ధి




- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు సీఎం కృషి
- బాలురు, బాలికల కళాశాల భవన నిర్మాణానికి రూ.19.10 లక్షల నిధులు మంజూరు
- రూ.100 కోట్లకుపైగా అభివృద్ధి పనులు
- సీఎంకు, ఎంపీ వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు

**మహబూబాబాద్ జులై 14(ప్రభాత గమనం):**


నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలుర, బాలికల కళాశాల భవనాల నిర్మాణానికి రూ.19.10 లక్షల రూపాయల అనుమతులు మంజూరు చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్ చిత్రపటానికి ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మానుకోట నియోజకవర్గంలో ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్య, వైద్యం, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అభివృద్ధిలో మహబూబాబాద్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఉదయపు ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత పట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మెరుగైన వసతులు, కొత్త భవనాలు, విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు తమ భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మహబూబాబాద్ మున్సిపల్ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గణపురం అంజయ్య,కాంగ్రెస్ పార్టీ స్థానిక కౌన్సిలర్ బోడ రవి, మహబూబాబాద్ మున్సిపాలిటీ కౌన్సిలర్ లు,కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు,పట్టణ నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కేసముద్రంలో ప్రొటోకాల్ 'గల్లంతు'

- ప్రజాప్రతినిధులకు ఘోర అవమానం
- మున్సిపల్ అధికారుల ఏకపక్ష వైఖరిపై భగ్గుమన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు


**కేసముద్రం, జూలై 14( ప్రభాత గమనం) :**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల చేత ఎన్నుకోబడిన స్థానిక ప్రజాప్రతినిధులకు విలువ లేకుండా పోతోందా? అధికారిక హోదాల్లో ఉంటూ నిబంధనలను తుంగలో తొక్కుతున్న అధికారుల ఇష్టారాజ్యం ఎటో దారితీస్తోంది? అంటే.. అవుననే సమాధానం ఇస్తున్నాయి కేసముద్రం మున్సిపాలిటీలో చోటుచేసుకున్న తాజా పరిణామాలు. సోమవారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన పలు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ను పూర్తిగా తుంగలో తొక్కి, స్థానిక వార్డు కౌన్సిలర్లను కరివేపాకులా తీసిపారేసిన తీరు ఇప్పుడు నియోజకవర్గంలో తీవ్ర దుమారం రేపుతోంది. దీనిపై ఆగ్రహించిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం నేరుగా మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేయడం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో కొత్తగా నిర్మించిన నూతన ఫైర్ స్టేషన్ మరియు డీసీసీబీ బ్యాంక్ శాఖల ప్రారంభోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు, లోక్‌సభ సభ్యులు, మరియు స్థానిక శాసనసభ్యులు హాజరై, వారి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవాలు సైతం నిర్వహించారు. కానీ, ఏ మున్సిపాలిటీ పరిధిలో అయితే ఈ కార్యాలయాలు ప్రారంభమయ్యాయో.. అదే మున్సిపాలిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులకు (కౌన్సిలర్లకు) ఈ కార్యక్రమాలకు సంబంధించిన కనీస సమాచారం గానీ, ఆహ్వానం గానీ అందించకపోవడం గమనార్హం. తమ స్వంత ఇలాకాలో ఇంత పెద్ద ఎత్తున పండుగలా జరుగుతున్న అధికారిక వేడుకల గురించి స్థానిక వార్డు ప్రజాప్రతినిధులకు కనీసం సమాచారం కూడా ఇవ్వకపోవడం వెనుక అధికారుల అలసత్వమా? లేక కావాలనే దూరం పెట్టాలనే కుట్రానా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఒక ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగినప్పుడు దానికి సంబంధించిన ప్రోటోకాల్ నిబంధనలు చాలా స్పష్టంగా ఉంటాయి. స్థానిక సంస్థల ప్రతినిధుల పేర్లను శిలాఫలకాలపై వేయడంతో పాటు, వారిని గౌరవంగా ఆహ్వానించాల్సిన బాధ్యత స్థానిక అధికారులదే. అయితే, కేసముద్రంలో అధికారులు ప్రవర్తించిన తీరు చూస్తుంటే ఇది కేవలం 'యాదృచ్ఛికంగా' జరిగిన పొరపాటులా అనిపించడం లేదు. స్థానిక బిఆర్ఎస్ కౌన్సిలర్ల ప్రాతినిధ్యాన్ని పూర్తిగా తొక్కిపెట్టి, వారిని ప్రజాక్షేత్రంలో చిన్నబుచ్చేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల ఈ పక్షపాత వైఖరి వెనుక ఉన్న అదృశ్య






రాజకీయ హస్తం ఏది? అధికారం చేతిలో ఉందని స్థానిక ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తారా? అంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు.తమకు జరిగిన ఘోర అవమానంపై భగ్గుమన్న బిఆర్ఎస్ కౌన్సిలర్లు మంగళవారం ఒక పిటిషన్ సిద్ధం చేసి నేరుగా జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. "ఇది కేవలం మా వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన విషయం కాదని. కేసముద్రం ప్రజలు ఓట్లేసి గెలిపించినందుకు మాకు మరియు మమ్మల్ని ఎన్నుకున్న ప్రజలకు జరిగిన అవమానం" అంటూ వారు తమ ఆవేదనను వెళ్లగక్కారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు కారణమైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, తమ ఆత్మగౌరవాన్ని కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులను నోటిఫికేషన్లు, ఇన్విటేషన్ల నుంచి దూరం పెట్టి రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న ఇలాంటి అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి యాక్షన్ తీసుకోబోతున్నారు? తమ తప్పును కప్పిపుచ్చుకోవడానికి స్థానిక యంత్రాంగం ఎలాంటి కుంటిసాకులు చెప్పబోతోంది? అనేది ఇప్పుడు కేసముద్రం రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఆగె రాము, వినయ్ రెడ్డి, శరత్ యాదవ్, కృష్ణ, నాయకులు మేకల వీరన్న, దేవేందర్ తదితరులు ఉన్నారు.



తేది :14-07-20..

శ్రీయుత గౌరవనియులైన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా

విషయం : నిన్న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో జరిగిన పలు ప్రభుత్వ అధికారిక కార్యక్రమలలో జరిగిన ప్రోటోకాల్ ఉల్లంఘన పై పిర్యాదు.

అయ్యా !

కేసముద్రం మున్సిపాలిటీ BRS పార్టీ కౌన్సిలర్లం ఐన మేము పై విషయానుసారం తమరికి పిర్యాదు చేయునది ఏమనగా నిన్న కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో నిన్న జరిగిన ఫైర్ స్టేషన్ ప్రారంభోత్సవం మరియు DCCబ్యాంకు ప్రారంభోత్సవం గౌరవ రాజ్యసభ సభ్యులు MP, MLA లు చేతుల మీదుగా ఘనంగా జరిగింది ఇట్టి కార్యక్రమనికి స్థానిక ప్రజా ప్రతినిధులం అయిన మాకు కనీసం సమాచారం మరియు ఆహ్వానం అందించకుండా మమ్ములను అవమానించినారు కావున దీనికి కారణం అయిన సంబంధిత శాఖల అధికారుల పై తగు చర్యలు తీసుకొని మా గౌరవాన్ని కాపాడవలసినది గా తమరికి విజ్ఞప్తి చేస్తున్నాను .

ఇట్లు

BRS పార్టీ కౌన్సిలర్స్

1 B. Aruna
2 P Ram
3 [signature] (R. Vinayreddy)
4 [signature] (P. Sharath yadav)
5 M. Shaceekh
6 A. [signature]

# ఎస్ఐఆర్ ప్రక్రియలో రేషన్ డీలర్ల సహకారం కీలకం



**అదనపు కలెక్టర్ ఎస్.రవి**

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయడంలో రేషన్ డీలర్లు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎస్. రవి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయడం, ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడం, గణన ఫారాల సేకరణపై చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎస్. రవి మాట్లాడుతూ, ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇప్పటికే ఓటర్లకు గణన (ఎన్యూమరేషన్) ఫారాలను అందజేశారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను తిరిగి బీఎల్‌వోలకు అందించేలా రేషన్ డీలర్లు చొరవ తీసుకోవాలని సూచించారు. తమ పరిధిలోని ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొనేలా అవగాహన కల్పించి సహకరించాలని కోరారు. అదేవిధంగా, ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటరు నమోదై ఉండటం ఎన్నికల చట్టాల ప్రకారం నేరమని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటర్ల జాబితాను పారదర్శకంగా, తప్పుల్లేకుండా రూపొందించేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన అన్నారు. జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులో విజయవంతంగా పూర్తి చేయడానికి రేషన్ డీలర్లు, బీఎల్‌వోలు, సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, రేషన్ డీలర్ల సంఘం ప్రతినిధులు రమేష్‌బాబు, మోహన్‌తో పాటు హనుమకొండ, కాజీపేట, హసన్‌పర్తి మండలాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.




# బెరువాడ పాఠశాలలో లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

**కేసముద్రం, జులై 14(ప్రభాత గమనం):**

కేసముద్రం మండలం బెరువాడ గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ కేసముద్రం ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ చార్టర్ సెక్రటరీ లయన్ మారగాని కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని రూ.6,000 విలువైన మూడు సీలింగ్ ఫ్యాన్లను పాఠశాలకు అందజేశారు. అలాగే విద్యార్థులకు ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ, విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఆదర్శప్రాయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిర్మూలన వంటి అంశాలపై చిన్నారుల్లో చైతన్యం కల్పించడం కాలానుగుణ అవసరమన్నారు. పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో దాతలు ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. సమాజ సేవలో లయన్స్ క్లబ్ నిరంతరం ముందుంటోందని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి విద్యార్థి తీసుకోవాలని పిలుపునిచ్చారు. సమాజానికి ఉపయోగపడే విలువలను చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బీరం జనార్దన్ రెడ్డి, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కనకయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ యర్నం శ్రీరాములు, కోశాధికారి మడిపెద్ది వెంకటేష్, చార్టర్ ప్రెసిడెంట్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్, బెజ్జం ప్రేమ్ కుమార్, చింత కరుణాకర్, మారగాని రాంబాయి, మారగాని శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటలు సాగు చేయాలి

- ఎక్కువ నీటి పంటల జోలికెళ్తే నష్టమే
- సబ్సిడీపై కందులు, మినుము విత్తనాలు సిద్ధం..
- రైతు వేదికల ద్వారా పంపిణీ
- మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ అజ్మీరా శ్రీనివాసరావు

**గార్ల ,జూలై 14 ( ప్రభాత గమనం) :**

ప్రస్తుత ఎల్నినో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాభావ ముప్పు పొంచి ఉన్నందున, రైతులు సాంప్రదాయ పద్ధతులకు భిన్నంగా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ (ADA) శ్రీ అజ్మీరా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పినిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక రైతు అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు.ఎల్నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో పడక, నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఏడీఏ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కువ కాల పరిమితి ఉండి, నీటి వినియోగం ఎక్కువగా ఉండే పంటలను సాగు చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో, స్వల్ప కాలంలో చేతికొచ్చే పెసర, మినుములు, కందులు, వేరుశనగ, జొన్న, సజ్జ, రాగులతో పాటు కూరగాయల సాగు చేపట్టాలని సూచించారు. వీటి ద్వారా నీటి కొరత సమస్యను అధిగమించడమే కాకుండా, మంచి ఆర్థిక ప్రయోజనాలు పొందవచ్చని వివరించారు.రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు



సూచించే సాంకేతిక సలహాలను పాటించాలని కోరారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం ద్వారా భూసారం పెరగడమే కాకుండా, పంటలకు ఆశించే చీడపీడలను సహజంగానే నివారించవచ్చని స్పష్టం చేశారు.ప్రస్తుతం రైతులకు అవసరమైన కందులు, మినుములు విత్తనాలను ప్రభుత్వం రాయితీ (సబ్సిడీ) పై అందిస్తోందని, ఇవి స్థానిక రైతు వేదికల వద్ద అందుబాటులో ఉన్నాయని ఏడీఏ తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి రైతులకు రాయితీపై కందుల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రామారావు, ఏఈఓ రాజ్యలక్ష్మి , ఇరిగేషన్ ఏఈ భరత్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, ఆత్మ కమిటీ మెంబర్ ఇందుర్తి వెంకటరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# పంజాబ్ రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్లకు షాక్

- పెంచిన ఫీజులను వాపస్ చేయాలని సర్కార్ హుకుం
- మూడేళ్లుగా ఏటా 5శాతంపైగా ఫీజుల పెంపు

**చండీఘడ్,ప్రభాత గమనం :**


పంజాబ్‌లోని ప్రైవేట్ స్కూళ్లకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు.. ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లించలేదని మానసిక వేధింపుల కారణంగా ఇటీవల అమృత్‌సర్‌లో 17ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను భగవంత్‌మాన్ ప్రస్తావించారు. ఈ ఘటన తర్వాత, అధిక ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటున్నామన్నా రు. ఈ ఆర్డినెన్స్‌ను కోర్టులో సవాలు చేసినా తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని.. ఈ విషయంలో వెనుకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు. కొత్త ఆర్డినెన్స్ ప్రకారం.. ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధింపు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అంచనా.

# బడుల్లో 'బహిర్భూమి' బాగోతం..

- టాయిలెట్లు లేక నిత్యం విద్యార్థుల అవస్థలు
- కేసముద్రం మండలం ఇంటికన్నె హైస్కూల్ లో దారుణం
- బాయ్స్ కు టాయిలెట్స్ లేక.. దిక్కుతోచక పొదల్లోకి పరుగులు
- 'స్వచ్ఛ భారత్' నినాదాల వెనుక సిగ్గుచేటైన నిజం

**కేసముద్రం, జూలై 14 (ప్రభాత గమనం) :**

డిజిటల్ క్లాసులు, కార్పొరేట్ స్థాయి విద్య అంటూ ప్రభుత్వం కోట్లు కుమ్మరిస్తున్నామని చెప్తున్న మాటలకు, క్షేత్రస్థాయిలోని చేదు నిజాలకు పొంతన లేకుండా పోతోంది. కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామ ప్రభుత్వ హైస్కూల్‌లో కనీస సౌకర్యాల లేమి విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పాఠశాలలో బాయ్స్ కు నిర్మించిన టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో, విద్యార్థులు విధిలేని పరిస్థితిలో బహిరంగ ప్రదేశాలకే వెళ్లాల్సి వస్తోంది. దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ భారత్' అని నినదిస్తున్న తరుణంలో, ఈ పాఠశాల దుస్థితి ప్రభుత్వ విద్యా వ్యవస్థ వైఫల్యానికి అద్దం పడుతోంది.ఇంటికన్నె



హైస్కూల్‌లో వందలాది మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే బాలురకు కేటాయించిన టాయిలెట్లు నిర్వహణ లోపంతోనో లేదా ఇతర సాంకేతిక కారణాల వల్లనో మూతపడ్డాయి. దీంతో క్లాస్ విరామ సమయంలో విద్యార్థులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి పాఠశాల ఆవరణ వెనుక ఉన్న పొదల్లోకి, ఆరుబయటి ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. ఆ పొదల్లో పాములు, తేళ్లు వంటి విషకీటకాలు తిరుగుతుండటంతో విద్యార్థులు ప్రతిరోజూ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు బాలికల టాయిలెట్లపై దృష్టి పెడుతున్న అధికారులు, బాలుర సమస్యను పూర్తిగా విస్మరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్కూల్లో టాయిలెట్స్ లేకపోవడం వల్ల బయటకు వెళ్లాల్సి వస్తోంది. వర్షం పడితే మరీ ఘోరంగా ఉంటోంది. ఆ పొదల్లోకి వెళ్లాలంటే భయమేస్తుంది. మా బాధను అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు."ఈ విషయమై పాఠశాల యాజమాన్యానికి, విద్యాశాఖ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. "మన ఊరు – మన బడి" లాంటి పథకాలతో రంగులు మార్చడంపై ఉన్న శ్రద్ధ, కనీస అవసరాలైన మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణపై ఎందుకు లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగి విద్యార్థులకు ప్రాణాపాయం సంభవిస్తే బాధ్యత ఎవరిదంటూ గ్రామస్థులు నిలదీస్తున్నారు.పత్రికా ముఖంగా ఈ దారుణం వెలుగులోకి రావడంతోనైనా ఉన్నతాధికారులు స్పందిస్తారా? లేదా ఎప్పటిలాగే 'పరిశీలిస్తాం' అంటూ కాలయాపన చేస్తారా అనేది చూడాలి. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇంటికన్నె హైస్కూల్‌లో బాలుర టాయిలెట్లను పునరుద్ధరించాలని, విద్యార్థుల ఆత్మగౌరవాన్ని, ప్రాణాలను కాపాడాలని విద్యార్థి సంఘాలు, గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374